



# శ్రీమతి తలనొప్పి

రచన

## "ప్రమ"

ఎవరెస్టు శిఖరమంత ఎత్తు ఉన్న ఫైల్సు కట్టల్ని చూసి "ఇవన్నీ పూర్తి చేయటానికి ఈ జీవితం సరిపోతుందా?" అని ప్రశ్నించుకోవటంలో ఏమీ ఆశ్చర్యం లేదనుకుంటాను, ఇంకా యువకదశలోనే ఉన్న నేను.

నా జీవితంలో ఒక్క బాల్యదశే గడిచిపోయింది. ఇంకా జరుగుతున్న యవ్వనం, జరగవలసిన కౌమారం, వార్ధక్యదశలు గడవటానికి ఎన్ని సంవత్సరాలు పడతాయో? ఇప్పటికే ఆఫీసుపనిలో ఒక్కరోజు గడిచేసరికి ఒక్క సంవత్సరం గడిచినట్లుగా ఉంటోంది నాకు అలాంటిది ఇంకెన్ని రోజులు? ఎన్ని నెలలు? ఎన్ని సంవత్సరాలు? . తలుచుకుంటేనే గుండె నీరవుతోంది

ఈ తాలూకాఫీసులో గుమాస్తాగిరి కంటె వేరే ఆధారమేమీ లేకపోయె. పోనీ ఈ వెధవగుమాస్తాఉద్యోగానికి ఒక్క 'కిక్' ఇచ్చి బజార్లో స్వేచ్ఛగా అడుక్కుందామంటే ఒక భార్య, ఆవిడకో కొడుకు, వాడికి కొన్ని పాలడబ్బాలు. తనకు దూరకంతి లేదు గాని .

విమానవేగంతో పోటీచేస్తున్న నా ఆలోచనలొక్కసారి కూలిపోయాయి వాటికంతరాయం కలగటానికి కారణం, వీపుమీదెవరిదో చెయ్యి బరువుగా పడ్డది

"ఏమయ్యోయ్, నీకేం డబ్బక్కర్లేదా?"

వంటిమీద చెయ్యి పడటమేమిటి, నోటిలోనుంచి మాట రావటమేమిటి రెండూ ఒక్కసారి జరిగాయి. డబ్బనే పదం చెవిన పడేసరికి కొంపకి బియ్యం,

పంచదార వగైరాసరకులు సరఫరా చెయ్యాలని మెదడుకి వార్తలందాయి. ఆ డబ్బిచ్చే మహానుభావుడెవరో ఒక్కసారి తనివితీరా పరికిద్దామని నా మొహం పైకెత్తింది.

"నువ్వేం పనిచేసేట్టు లేవే" నావంక ఆఫీసరుగారి పెద్దపులితలకాయ ఉరిమిచూసింది.

శ్రీవారు పెట్టినవి నాలుగూ తిని ఇంటికి దారితీశాను.

మా ఇంటికి నాలుగిళ్లవతల ఉన్న ఆఫీసరుగారి భార్య ఎనిమిది గజాల సిల్కుచీర కట్టుకొని శ్రీవారిరాకకోసం నిరీక్షిస్తూ ఉంది. ఆవిడనడుం కొస్త పెద్దదవటంవల్ల గాబోలు కట్టుకున్న చీర మోకాలుదాకా ఎగదీసుకపోయింది

ఏమాత్రం పద్యాలు అల్లటం వచ్చినా ఆవిడగారి నడుంవలయాన్ని మా ఇంటి పక్కనే ఉన్న మునిసిపాలిటీవారి చెత్తడబ్బాతో పోల్చి వర్ణించి ఉందును.

కొంపలోకి అడుగుబెట్టగానే పక్కనే ఉన్న ఒక్కటే ఒక్కగదిలో మా ఇల్లాలు పడుకేసి ఉంది-ఇక్కడ మా శ్రీమతి గురించి కొస్త చెప్పక తప్పదు. మా ఆవిడకే తలనొప్పికే అవినాభావసంబంధం ఉంది. అదేం పాపకర్మమో గాని తలనొప్పిని వదలి ఆవిడగారు ఒక్కక్షణం కూడ ఉండలేదు. కాని పాపం దాంతోనే పనంతా తనొక్కతే చేసుకొంటుంది. లేకపోతే ఆవిడకి మాత్రం తెలియదూ ఈ గుమాస్తాగాడు ఇప్పటికే చాలక ఇంకొక మనిషిని కూడా ఎక్కడ పోషిస్తాడని.

మా శ్రీమతిలో ఉన్న గొప్ప సుగుణమేమంటే పగల్లా చచ్చేటట్టు పనిచేసి ఇంటి



కొచ్చిన మొగుడుముండావాడికి పిచ్చెక్కకుండా ఉండేందుకు సణుగుకోటాలూ, గొణుగుకోటాలూ లేక ఉన్న రెండు చీరలనే చిరిగిపోయినా కుట్టుకుని కట్టుకుంటూ ఎండ తగలక తెల్లబడ్డ గడ్డిని తల్లో పెట్టుకుని మొహం కళకళలాడుతూ కనబడుతుంది.

ఇల్లాలి ఈ గుణానికి మెచ్చుకొని, ఆవిడ తలనొప్పికి డాక్టర్ని పిలిచి మందు లిప్పించలేకపోయినా మనస్సులోనే శతసహస్ర అ వందనా లర్పిస్తూ ఉంటాను—

నా రాక గమనించిన మా శ్రీమతి పక్కనే ఉన్న ఒక్క గదిలో పడకనుంచి లేచి వడ్డించే ప్రయత్నాలు మొదలు పెట్టింది. పెందరాళే తినకపోతే లాంతరు కావద్దూ? లాంతరున్నా దాన్లోకి కిరసనాయిలు కావొద్దా? అందుకనే కొస్తంత వెలుతురుండగానే తిని పడుందామన్న ఉద్దేశం మాది.

కాళ్లు కడుక్కొని వస్తుండగా భార్యారత్నంగా గెదురై అత్యాశ్చర్యంతో చెప్పింది. పొద్దునే డాల్డాతో కలిపి వేసుకో వచ్చని తెచ్చిన సవాశేరు వెన్నమీద భగవాన్ జగద్గురు శ్రీశ్రీ బాబా వారి పాదాలు పడ్డాయని.

నా గుండె ఒక్కసారి ఆగిపోయినట్టయింది. కాళ్లు గజగజ వణికాయి. కళ్లు గిర గిర తిరిగాయి. ‘ఈ సవాశేరు వెన్నపూసనీ పదిలంగా అట్టే పెట్టాలి గాబోలురా భగవంతుడా’ అనుకొన్నాను. “పోదూ ఈ పాదాల్ని లెక్క పెట్టే దేమిటి. కరగబెట్టవాందా మనుకొన్నానుగానీ మళ్ళీ ఏం కీడు మూడుతుందో” నన్న భయం వేసి చచ్చినట్టు పక్క కొంపలో ఉన్న బాబా భక్తురాలైన డాక్టరమ్మదగ్గరికి పరుగెత్తుకువెళ్లాను ఈవిషయం చెప్పటానికి.

అవతలమనిషి ప్రాణం పోతున్నా పైసా చేతిలో పడితేనేగాని అడుగు ముందుకు పడని ఈవిడగారు భక్తురాలట!

ఊళ్లోకల్లా డాక్టరమ్మ ఒక్కతే అవటం వల్ల ఈవిడపేరు ఊరు ఊరంతా మారుమోగిపోవటంలో వింత ఏమీ లేదు. ఆవిడగారు రెండుచేతులా డబ్బు సంపాయించటంలో ఆశ్చర్యమూ లేదు పైగా ఈవిడచేత వైద్యం చేయించుకొంటున్నవారందరి దగ్గరా “బాబామందిరం” కోసమని చందాలు వేయించుకుంటుంది.

అటువంటి ఈ డాక్టరమ్మసందర్శనానికి వెళ్లిన నాకు ఆవిడ అప్పుడే రిక్షాలో నుంచి వస్తూ ప్రత్యక్షమైంది.

ఫలానిసంగతని చెప్పటమాలస్యం ఉన్నపాటున ఆవిడ మా ఇంటికి పరుగెత్తుకు వచ్చింది రిక్షాలో.

ఆశ్చర్యం! మేం ఇంట్లో అడుగు పెట్టామో లేదో మా ఆవిడ తందనాలాడుతూంది. అది చూసిన డాక్టరమ్మగారి ఆనందం అపారం. నోరెళ్లపెట్టుకొని చూస్తున్న నావైపు చూసి ఆవిడే అంది. “మీ భార్యగారిలో బాబా ప్రవేశించారు”

బిత్తరపోయి చూస్తున్న నేను ఆవిడ మళ్లీ ఏవో మాట లంటూంటే తేరుకొన్నాను. అప్పటికే కొన్ని మాట లనేసింది. నాకు వినపడిన పలుకు లివి. “ పాదాలు పడ్డాయన్నారు చూపిస్తారా?” ఆవిడ నన్ను అనుసరించగా నేను వంటింటిలోకి దారి తీశాను. ఆ దృశ్యం చూశిన ఆమె ఆశ్చర్యంతోనూ, ఆనందంతోనూ పరవశురాలై పోయింది.

మళ్లీ ఇవతలి గదిలోకి ప్రవేశించేటప్పటికి మా ఆవిడ “ఈ తలనొప్పితో నా తలకాయ బ్రద్దలయిపోతోంది” అంటూ ఏడ్చేస్తోంది.


“అరరే, బాబాగారికి తలనొప్పి వచ్చిం” దంటూ వెంటనేఉన్న బాగ్‌లోనుంచి ఏవో మంగులు తీసి ఇచ్చింది డాక్టరమ్మ.

ఆ రోజు మొదలుకొని డాక్టరమ్మ మా ఆవిడకి మందులు ఊరికే నే ఇవ్వటం మొదలు పెట్టింది. ఓసారి నేను ఏదో కొంత డబ్బు ఇవ్వబోతే “అటువంటివారిదగ్గర డబ్బు పుచ్చుకుంటామటండీ” అంటూ తిప్పి కొట్టింది చిఱునవ్వుతో. భగవంతుని పుణ్యమా అంటూ మా ఆవిడతలనొప్పి తగ్గిపోయింది డబ్బూ గిబ్బూ లేకుండా.

ఈ విషయం మా ఆవిడతో నే చెప్పుదన్నా అంటే అది అదోలాగ నవ్వుతుందెందుకో. “అదేమిటే అలా నవ్వుతా” వంటే “దీని కంతకీ ఉందిలెండి చిదంబర రహస్యం” అంటుంది కాని ఆ రహస్య మేమిటో చెప్పదు.

నయాన, భయాన చెప్పగా ఓ సుముహూర్తాన బయటపెట్టిం దారహస్యం. ఈవిడగారికి బాబా పూనా లేదుట ఏమీ లేదుట. అంతా వట్టి నట నేనట. “మరి వెన్నమీద పాదాలు పడ్డాయి కాదుటే?” అంటే మా శ్రీమతి నవ్వుతూ నా వళ్లో వాలిపోతూ తనే గీశానంది.

ఎలాగైనా మా శ్రీమతి తలనొప్పిబాధ తొలగింది. అదే నాకు సంతోషం. ★



“ఉత్తరం అంత మెల్లిగా రాస్తున్నావేం ?”
“మా ఆవిడ గబగబ చదవలేదు.”